# ఆశే యమపాశమై

- మీనాక్షి శ్రీనివాస్



'ఒరే సింగన్నా, మల్లన్నా, నాగులూ బేగి రండెహే... మన నారాయణ కొడుకు బోరుబాయిల పడిపోయాడంట...' పెద్దగా అరుస్తూ ఆ పొలంలో నారు పోస్తున్న తన వాళ్లందరినీ పిలిచాడు నరసింహ.

'ఏటేటి మన నారాయణ కొడుకే... ఎప్పుడు?' అంటూనే బిలబిలా నరసింహ దగ్గరికి వచ్చేశారు ఆ పొలంలో పనిచేస్తున్న ఆ కూలి జనమంతా.

వాళ్లంతా నాయుడుగారి పొలంలో కూలినాలి చేసుకు బతికే జనం. నాయుడు గారి పొలాన్ని ఆనుకునే మున్సబు గారి పొలం ఉంది. దానిలో బోరుబావి తవ్వినా లాభంలేక ఆ పొలం, ఆ చుట్టుపక్కల పొలాలు కూడా బీడువారి పోతుంటే చూడలేక గ్రామ సర్పంచి, ఇంకా కొంతమంది గ్రామపెద్దలు కలిసి అర్జీ పెట్టుకుని బోరుబావికి పర్మిషన్ తెచ్చుకున్నారు. ప్రభుత్వమే ఆ గ్రామానికి సాగునీటి, మంచినీటి వసతి కోసం గ్రాంట్స్ శాంక్షన్ చేసి, నీరుపడే చోటు ఇంజనీర్ చేత పరీక్ష చేయించి, ఆ ఊరు నుంచి ఈ పొలాలకొచ్చే దారిలో బోరు వెయ్యడానికి నిర్ణయించారు. నాలుగు రోజులుగా నానా కష్టం పడి ఆ రాతి ప్రదేశంలో బోరు తవ్వుతున్నారు.

సరిగా రోడ్లూ, ఓ దారీతెన్నూ లేని ఆ ఊరిలో అక్కడ బోరు తవ్వుతున్నారని తెలిసినా, చుట్టూ రాళ్లూ రప్పలూ, మన్నూ మశానం ఉన్నా, అన్నెం పున్నెం తెలీని పసివాళ్లకు దాని దగ్గరకు వెళ్లడం

ప్రమాదమనీ, వెళ్లకూడదనీ తెలియదుగా... ఫలితం ఆరేళ్ల బుజ్జిపండు, నారాయణ కొడుకు అందులో పడిపోయాడు.

ఆ నోటా ఈ నోటా ఆ విషయం ఊరంతా పాకింది. ఆడామగా, చిన్నాపెద్దా అంతా ఆ బోరుబావి దగ్గరకు చేరుకున్నారు. విషయం తెలిసి బుజ్జిపండు తల్లి సీతాలు గుండెలవిసేలా ఏడుస్తూ అక్కడకు చేరుకుంది. చిన్నాచితకా అవసరాలకు కూడా పక్కనున్న పట్నం పోవలసిన పల్లెటూరు అది. ఆ పట్నం పోవడానికి కూడా ఈ పూట కాపూట వచ్చే డొక్కు ఎర్ర బస్సు తప్ప వేరే ప్రయాణ సాధనం అంటూ లేని కుగ్రామం.

'ఈమధ్యన అస్తమానం పేపర్లలా సదువుతూ ఉంటిమి కదా... బోరుబాయిల పిల్లడు పడ్డడు... పిల్లడు పడ్డడు– అని అయినా ఈ బాయిలపైన ముయ్యకుండా ఎట్టా ఒగ్గేసేరు... ఆమాత్తరం జార్త నేకపోయిందా ఆ ఆఫీసరు బాబుకి...' అంటూ ఎవరికి తోచిన వ్యాఖ్యలు వాళ్లు చేస్తున్నారు.

ఏం చెయ్యాలో తెలియని అయోమయ స్థితి, అక్కడ పర్యవేక్షించే సూపర్‌వైజరూ, బావి తవ్వించే ఇంజనీరు బాబూ... ఏం చెయ్యాలా అని ఒకటే తర్జన భర్జన పడుతుండారు.

పట్నం ఫోను చేసి పోలీసోళ్లకూ, అక్కడున్న అన్ని ప్రభుత్వ ఆఫీసులకూ విషయం వివరించారు సూపర్‌వైజరూ... ఇంజనీరు దగ్గరకెళ్లి ఆ గొయ్యిలోకి చూసినా, చీకటి సొరంగం లాంటి గొయ్యి తప్ప మరేదీ కనబట్లేదు... ధైర్యం చేసి దగ్గరకెళ్లి చూసిన ఓ కూలీకి చీకటి తప్ప మరేదీ కనబడలేదు. నిముషాల మీద ఆ విషయం ఊరంతా పాకిపోయింది. సీతాలు గోలగోలగా ఏడుస్తోంది. ఇంత జరిగినా నారాయణ జాడ లేదు.

నారాయణ ఏడి, ఏడపోయిండు... వాళ్లలో వాళ్లు అనుకుంటున్నారు. నారాయణ కూతురు పన్నెండేళ్లదీ, ఇంకో పెద్దకొడుకు పదేళ్లవాడూ ఏం జరిగిందో, ఏం జరుగుతోందో, తమ చిన్న తమ్ముడు ఏమయ్యాడో. తల్లి పొగిలి పొగిలి ఎందుకేడుస్తోందో తెలియక, సగం అర్థం అయి సగం అర్థం అవక బిక్కచచ్చి ఉన్నారు.

ఆ కుర్రాడు బావిలో పడిన కొన్ని గంటలకు పక్క పట్నం నుంచి ఆక్సిజన్ సిలిండర్, ట్యూబ్ తెప్పించి నలభై అడుగుల లోతున్న ఆ గోతిలోకి ఆక్సిజన్ పంపించసాగారు.

ఈలోగా తవ్వకం సిబ్బంది అంతా ఈ గోతికి కొంచెం దూరంలో ఇంకో కంత తవ్వి అక్కడి నుండి ఈ గోతిలోకి సొరంగం తవ్వే పని మొదలుపెట్టారు.

అక్కడున్న వాళ్లందరికీ తెలుసు ఆ పసివాడు ఆసరికే 'హరీ' అని వుంటాడనీ, ఇదంతా అనవసరం అనీ, కానీ ఆ హంగామా అంతా చెయ్యకపోతే ఆ తల్లిదండ్రులూ, ఇంకా అక్కడున్న స్థానికులు గోలగోల చేస్తారనీ, వాళ్లను బ్రతకనివ్వరనే ఈ హడావుడి, మెలోడ్రామా.

అక్కడే జనంలో ఉన్న చైతన్యకు ఈ హంగామా అంతా చూస్తే నవ్వాలో ఏడ్వాలో కూడా తెలియలేదు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా జరగవలసిన అనర్థం జరిగిపోయాక ఎవరిని ఉద్ధరించడానికి, ఎవరిని మోసం చేయడానికి ఈ తతంగమో అర్థం కాలేదు. మహా మహా పోటుగాళ్లే అంత లోతు వున్న గోతిలో హఠాత్తుగా పడిపోతే, అసలు ఏం జరిగిందో తెలిసేలోపే గుండె ఆగిపోవడం ఖాయం కాకపోయినా ఎక్కడో ఆయుష్షు వుండి, మొండి పిండం వాడయినా ఆ గోతిలో, మట్టిలో కొన్ని గంటలుంటే ఊపిరాడక చావడం ఖాయం.

అలా అంత పెద్ద గొయ్యి తవ్వి పైన ఏ కవర్ చెయ్యకుండా, ఇనప జాలీలో, చెక్క జాలీయో పెట్టకుండా చుట్టుపక్కలంతా ఫెన్సింగ్ మరోటో టెంపరరీగా అయినా వేసి ముందు జాగ్రత్త పడటం మానేసి అంతా అయిపోయాక ఈ జాతర, తిరనాళ్ల ఎవరిని మోసం చెయ్యడానికి?

ఇప్పుడా పిల్లాడి శవాన్ని వెలికితీసి బోలెడు సానుభూతి, అదీ కాకుంటే నష్టపరిహారం, అదే ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు. అంటే డబ్బుతో పోయిన ప్రాణం తిరిగొస్తుందా, ఆ కన్నకడుపు శోకం

తీరిపోతుందా... అలా ఆలోచనతోనే ఏదో స్ఫురించి ఒక్కసారిగా గుండె ఝల్లుమంది చైతన్యకు.

ఏడీ నారాయణ, ఇంత జరిగినా, జరుగుతున్నా ఊరు ఊరంతా కదిలి వచ్చినా నారాయణ రాకపోవడం ఏమిటి?

తను ఉదయం పాన్‌షాప్ దగ్గర పేపరు చూస్తుంటే నారాయణ, చిన్నకొడుకుని అదే ఈ బుజ్జిపండుని అక్కడకు తీసుకొచ్చి చాక్‌లెట్ కొనిపెట్టాడుగా, తను వాళ్లను పలకరించాడు కూడాను. ఎందుకో నారాయణ చాలా అనీజీగా కనిపించాడు. అంటే... అంటే... ఇక ఆపై ఆలోచించడానికి కూడా భయమేసింది చైతన్యకు.

ఎస్... తన ఊహ, తన అనుమానం నిజమే అయి ఉంటాయి. లోకంలో ఎన్నో అమానుషాలు జరిగిపోతున్నాయి, డబ్బు అన్న రెండక్షరాల పదం యావత్ ప్రపంచాన్ని, కాదు కాదు ప్రాణికోటినీ గుప్పెట పెట్టుకుని ఆడిస్తోంది.

'ఒరేయ్... నారాయణ మున్సబుగారి పొలంలో తప్పతాగి ఒళ్లు తెలీకుండా పడున్నాడంటరోయ్...' అనే నాగులు కేక చైతన్య ఆలోచనల్ని సర్రున కోసుకెళ్లింది.

తనకు తెల్సినంతవరకు నారాయణ తాగుబోతు కాదు, ఎప్పుడైనా మనసు బాగోకపోతేనో, మంది మరీ బలవంతపెడితేనో తప్ప తాగుబోతు మాత్రం కాడు. మరి అటువంటివాడు అంత ఉదయాన్నే అంత తాగి పడిపోవడం ఏమిటి? ఎస్... తనకొచ్చిన అనుమానం అనుమానం ఎంతమాత్రం కాదు. పచ్చి నిజం. ఆ ఆలోచనకే నిలువెల్లా కంపించిపోయాడు చైతన్య.

ఎలా ఇంటికొచ్చి పడ్డాడో తెలీదు. కడుపులో కలచేసి వాంతి అయిపోయినా కడుపులో తిప్పడం తగ్గలేదు. కళ్లు మూసినా, కళ్లు తెరిచినా ఓ వికృత కృత్యం, ఓ ఘాతుకం కళ్లముందు కదలాడుతోంది. తల బద్దలై పోతోంది. ఇక ఉండలేకపోయాడు. తన తండ్రి పేరుమోసిన లాయర్ పట్నంలో. ఇంట్లో తోబుట్టువు భర్తకు సుస్తీ చేస్తే తనని వెంటబెట్టుకు నిన్ననే తాతగారి ఊరు వచ్చారు. వస్తే వచ్చారు. తను ఆ సమయానికి అక్కడకు వెళ్లకుండా ఉండాల్సింది. ఎంత పని జరిగిపోయింది. తనది ఎంతమాత్రం అనుమానం కాదు. అది పచ్చి నిజం, ఒళ్లు గగుర్పొడిచే రాక్షస కృత్యం. అమానుషం...

గదిలోంచి బయటకు వచ్చాడు. తండ్రి, తాతగారూ, మేనత్త భర్త కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.

'నాన్నా...' గట్టిగా పిలిచాననుకున్నాడు చైతన్య.

నిముషాలు గడిచాయి. ఎందుకో తలెత్తి చూసిన చైతన్య తండ్రి రావుగారికి నిస్తేజంగా, నిర్జీవంగా తమకేసి పిచ్చిచూపులు చూస్తూ నిల్చున్న చైతన్య కనిపించాడు.

'ఏమిట్రా చైతూ... అలా నిలబడిపోయావేమిటీ, ఒంట్లో బాగాలేదా. అలా వున్నావ్. ఇలా రా...' అంటూ పిలిచాడు.

'నాన్నా... మీతో కొంచెం మాట్లాడాలి. ఓసారిలా వస్తారా' నెమ్మదిగా పిలిచాడు చైతన్య.

'ఏమిట్రా... ఏమయింది? ఒంట్లో బాగాలేదా ఏమిటీ... కొంపదీసి ఆ బోరువెల్ తవ్వే దగ్గరికి వెళ్లావా ఏం... నువ్వసలే సెన్సిటివ్... వింటేనే బాధనిపించింది. ఇంక చూస్తే ఏం తట్టుకుంటాం...' అంటూ కొడుకు దగ్గరగా వచ్చాడు రావు.

'నాన్నా...' అంటూ తండ్రి చెయ్యి పట్టుకుని తమ గదిలోకి ఇంచుమించు లాక్కెళ్లిపోయాడు చైతన్య. గదిలోకి వెళ్లగానే తలుపులు గడివేసి తన అనుమానం, ఆలోచన తండ్రికి చెప్పాడు చైతన్య.

'ఛ... ఛ... అసలు నీకెందుకొచ్చింది అలాంటి ఆలోచన. అదేదో ప్రమాదవశాత్తూ జరిగింది. ఈమధ్య కాలంలోనే ఇలాంటివెన్ని వినడం లేదు. పేపరు చూస్తే చాలు. ఈ మధ్య కాలంలోనే మన రాష్ట్రంలోనే కాదు, ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. ఎన్ని జరిగినా మినిమమ్ కేర్ తీసుకోవడం లేదు. ఓసారి అయ్యో అనుకోవడం, తరువాత మరచిపోవడం

మామూలయిపోయింది. అసలు నిర్లక్ష్యంగా వ్యవహరించి అంతంత ప్రమాదాలకు కారణమైన వారిని సస్పెండ్ చెయ్యడం, డిస్మిస్ చెయ్యడం కాదు, పరోక్ష హత్యానేరం కింద మూసెయ్యాలి.'

'సర్లే! నువ్వంత వర్రీ కాకు. ఏం చేస్తాం. వాడికి అలా రాసిపెట్టి ఉంది. అంతే, నువ్వు టాబ్లెట్ వేసుకు పడుకో. రేపు మనం వెళ్లాలి, నాకవతల బోలెడు అర్జంటు కేసులున్నాయి...' అంటూ వెళ్లబోయాడు రావు.

'నాన్నా! నే చెప్పేది వినండి. నేను భ్రమలోనో, భ్రాంతిలోనో అలా అనడం లేదు. ఖచ్చితమైన కాలిక్యులేషన్‌తోనే చెబుతున్నా. పొద్దున నేను పాన్‌షాప్ దగ్గర పేపర్ చూస్తుంటే, నారాయణ బుజ్జిపండుకు చాక్‌లెట్ కొనిచ్చి కూడా తీసుకెళ్లడం కళ్లారా చూశాను.'

'నెక్స్... ఎప్పుడో దేర్‌గా తప్ప తాగని నారాయణ ఉదయాన్నే తప్పతాగి మున్సబు గారి పొలంలో పడివున్నాడట. ఆలోచించండి నాన్నా, విషయం మీకే అర్థమవుతుంది' ఉద్వేగంగా అన్నాడు చైతన్య.

కొడుకు అంత ఖచ్చితంగా చెబుతుంటే మ్రాన్పడిపోయాడు రావ్. రోజూ ఎన్నోచోట్ల ఎన్నో అరాచకాలూ, దురాగతాలూ జరుగుతున్నాయని వింటున్నాం, చూస్తున్నాం, పేపర్లలో చదువుతున్నాం. ఏమో... జరిగినా అలా జరిగి ఉండవచ్చు. ప్చ్... ఏమైపోతోంది ఈ మానవజాతి. కాసుల కోసం ఇంత కసాయితనం, అమానుషత్వం ప్రబలిపోతుంటే, అనాగరికుల కంటే అనాగరికంగా ప్రవర్తిస్తుంటే... ఇక ఆలోచించలేకపోయాడు రావు.

ఒక్కసారి తల విదిలించి, కొడుకు చెయ్యి పట్టుకున్నాడు.

'చైతూ... ఏదో జరిగింది. జరిగిందేమిటో, అలా ఎందుకు జరిగిందో మనకనవసరం. ఒకవేళ అదే నిజమైతే, ఆ విషయం బయటకు పొక్కితే, ఎందుకోసమైతే నారాయణ ఆ పని చేశాడో అది జరగదు. న్యాయమైనా, అన్యాయమైనా జరగరానిదే జరిగిపోయింది. నువ్వు మనసు పాడుచేసుకోకు. ఇంకెక్కడా పొరపాటుగానైనా మాట జారకు. మనం రేపే, కాదు కాదు ఈ రోజు మధ్యాహ్నం బస్సుకే వెళ్లిపోదాం. సరేనా! రిలాక్స్...' అంటూ వెళ్లిపోయాడు రావు.

'అదేమిటర్రా... రేవటి వరకూ ఉంటామన్నవాళ్లు ఈరోజే హఠాత్తుగా వెళ్లిపోతున్నారు. మా ఎవరి మీదనైనా దేనికోసం అయినా కోపం వచ్చిందా ఏం...' అడిగింది చైతన్య మేనత్త.

'ఛ... ఛ... అదేం కాదు సుందరీ! నాకు అర్జంటు కేసులున్నాయి. ఈ వేళ వెడితే రాత్రికి కేను స్టడీ అదీ చెయ్యడానికి టైము కలిసొస్తుందని. పోనీ చైతన్యని ఉంచుదామా అంటే వాడికి వారం రోజుల్లో ఇంటర్వ్యూ వుంది. ప్రిపరేషన్ లేకపోతే కష్టం. నెల్లాళ్లలో మళ్లీ వస్తాంగా.'

'ఈసారి వదిననీ, ప్రియనూ కూడా తీసుకురావాలి మరి' అంది సుందరి.

'తప్పకుండా వస్తాం. వాళ్లూ మిమ్మల్నందరినీ చూసినట్టుంటుంది.'

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక పట్నం బయలుదేరారు తండ్రీకొడుకులు. అప్పటికింకా తవ్వడం పూర్తవలేదు. పిల్లాడి అతీగతీ తెలియదు. భారంగా బస్ ఎక్కారు తండ్రీకొడుకులు.

మర్నాడు కాజువల్‌గా పేపరు చూస్తున్న చైతన్యకు కళ్లు బైర్లు కమ్మాయి.

'ధనాశతో ముక్కుపచ్చలారని కొడుకుని మట్టిపాలు చేసిన తండ్రి' అంటూ టైటిల్‌తో... బోరుబావి తవ్వకం నుంచీ, పిల్లాడి శవాన్ని బయటకు తీసిన ఉదంతం వరకూ వ్రాశారు.

'అయింది, అనుకున్నంతా అయింది. నారాయణ చేజేతులా ఆ పసివాడిని ఆ బావికి బలిచేశాడు' కళ్లనీళ్లతో ఆసాంతం చదివాడు చైతన్య.

తప్పతాగి స్వయంగా ఆ నిజాన్ని బైటపెట్టాడట నారాయణ.

ధనాశతో... ఒక్కడిని బలి ఇస్తే మిగతా ఇద్దరి పిల్లల భవిష్యత్ అయినా బాగుంటుందనే

తెలివితక్కువ ఆలోచనతో నారాయణ ఆ పని చేసినట్లు, చేశాక తట్టుకోలేక పీకలదాకా తాగి పడిపోయిన నారాయణని నాగులు వాళ్లు చూసి ప్రమాద స్థలానికి తెచ్చారట.

ఆసరికే పిల్లాడి శవాన్ని బయటకు తీశారుట. రక్తసిక్తమై నిర్జీవంగా పడివున్న వాడిని చూసేసరికి తట్టుకోలేక గోలగోలగా ఏడుస్తూ, తన దురాశే, తన దౌర్భాగ్య స్థితే అందుకు కారణం అంటూ గోలగోలగా ఏడ్చాడట. బోరుబావి తవ్వకం మొదలైన రోజే తనకు ఆ దురాలోచన వచ్చిందనీ, అప్పటికే రెండుమూడు చోట్ల అలా జరగడం, దానికి ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియాగా లక్ష రూపాయలు ముట్టజెప్పడం గుర్తొచ్చి, అలా చేస్తే తన దరిద్రం శాశ్వతంగా దూరమవుతుందనీ, వాడు పోయినా మిగిలిన పిల్లలకు బాగా చదువు అదీ చెప్పించి, పిల్లకు మంచి సంబంధం చెయ్యొచ్చని అలా చేశానని, ఏ శనిదేవతో తనచేత అలా చేయించిందనీ, తనకు డబ్బులొద్దు... తన చిన్నారి కొడుకే కావాలని ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లాడు.

ఆ వార్త చదవగానే గబగబా తండ్రి దగ్గరకెళ్లాడు చైతన్య. నిశ్చేష్టులయ్యారు రావుగారు. ఆయనకు నారాయణ మీద కోపం, అసహ్యం కలగడానికి బదులు జాలి, సానుభూతి కలిగాయి.

'నాన్నా... ఇది కావాలనే చేశారు కనుక ప్రభుత్వం డిక్లేర్ చేసిన ఆ ఎక్స్‌గ్రేషియా ఇవ్వదేమో కదూ' హఠాత్తుగా అడిగాడు చైతన్య.

'నిజమే... బహుశా ఇవ్వకపోవచ్చు. పాపం... నారాయణ కొడుకునీ, పరువునీ, బ్రతుకునీ పోగొట్టుకోవడమే కాక బహుశా హంతకుడిగా శిక్షింపబడతాడు కూడా...' నెమ్మదిగా అన్నారు రావుగారు.

'బాగా అయింది... లేకపోతే అంత దారుణం చేసిన వాడిని ఊరికే వదలాలా...' కసిగా అన్నాడు చైతన్య.

'చైతూ... ఏ తండ్రీ అలా చెయ్యడు, చెయ్యలేడురా... అలా చేశాడంటే ఎంత మానసిక వేదన, నరకం చవిచూసి ఉంటాడో ఆలోచించు. ఒక రకమైన ఫ్రస్ట్రేషన్, ఉన్మాదం ఆవహించి ఉండాలి ఆ నిముషంలో. ఏది ఏమైనా మనం వెంటనే వెళ్లి వాళ్లు ఏ పొజిషన్‌లో ఉన్నారో చూడాలి. మనకు చేతనైన సాయం చెయ్యాలి.'

'నాన్నా...' ఆశ్చర్యంగా పిలిచాడు చైతన్య.

'సాయమా... వాళ్లకా...'

'అవును. ఆత్మహత్యను ప్రేరేపించడం కూడా హత్య చెయ్యడం లాంటి నేరమే చట్టప్రకారం. అలాగే ఇలాంటి ఘాతుకాలకు పరోక్షంగా ప్రేరేపించిన వారిది తప్పు. నారాయణ కేవలం ఆయుధం మాత్రమే. హత్య చేసిన వాడినొదిలేసి ఆయుధాన్ని శిక్షించడం లాంటిదే నారాయణను

## కట్ట మీద మైమరచిన కల

**- కె.యాకూబ్‌రెడ్డి.**

ఊరి చెరువు మీంచి
అలలు అలలుగా వీస్తూ
ఆకాశాన బారులు తీరిన కొంగలు...

కొంగ రెక్కల్లోంచి
జారిపడిన అలల సంకలనమా
ఈ చెరువు!

అలల రెక్కల్ని విసురుతూ
ఆకాశానికి ఎగరాలని
ఉబలాట పడుతున్న చెరువు...

చెరువు నుంచి పైకెగిసిన
కవిత్వ శకలాలా
ఆ కొంగలు!!

శిక్షించడం. నువ్వు తయారుకా... మనం మధ్యాహ్నం ఆ ఊరు వెడదాం. నువ్వు కూడా ఉంటే నాకు కొంచెం సాయంగా ఉంటావు. నేకాసేపు పడుకుంటా...' అంటూ లోపలికెళ్లిపోయాడు రావు.

'నాన్నా... ఇందాక తాతగారి నుంచి ఫోను వచ్చింది. మనం వెళ్లక్కరలేదు. నారాయణని అరెస్టు చేసి జైల్లో పెట్టారట. రేపు కోర్టులో ప్రజంట్ చేస్తారట' నిద్ర లేచిన తండ్రితో చెప్పాడు చైతన్య.

నారాయణ తరపు వాదించడానికి వచ్చిన రావుని తోటి లాయర్లంతా వెర్రివాడిని చూసినట్లు చూశారు. స్వయంగా హంతకుడే హత్య చేశానని ఒప్పుకున్నాక ఇంక కేసు, వాదన ఏముంది. అలాంటి కేసు వాదించటం ఏమిటీ అని.

కోర్టులో ప్రాసిక్యూషన్ వాదన తరువాత రావుగారి వాక్పటిమ కోర్టు గోడలనే దద్దరిల్లజేసింది. అందులోని మానవతావాదం, అర్థవంతమైన ఆయన మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి, కంటతడి పెట్టించాయి.

'యువరానర్! కన్నకొడుకు అమానుషంగా హతమార్చాడు నారాయణ. నిజమే కానీ, అందుకు దోహదపడిన పరిస్థితులేమిటి?

ఇప్పటికి ఎన్నోచోట్ల ఇదే విధంగా జరిగినా కించిత్ అపరాధ భావం అయినా లేకుండా అలా తప్పి వదిలేసిన వాళ్ల బాధ్యత లేదా ఈ తప్పులో? సరే, ఎక్కడ ఏ ఉపద్రవం జరిగినా, ప్రమాదం జరిగినా... అలా ఎందుకు జరిగిందో, ఎవరు బాధ్యులో, దానికి రెమిడీ ఏమిటో ప్రభుత్వం మనసుపెట్టి యోచన చేస్తోందా? క్షమించండి యువరానర్... ప్రభుత్వ సేవకుడినైన నేను ఈ విధంగా మాట్లాడవచ్చో, లేదో నాకు తెలియదు. కానీ అన్నింటికంటే ముందు నేనో మనిషిని, మనసున్న మనిషిని. ఆ మనసే నాచేత ఇలా మాట్లాడిస్తోంది.

తాగిన మైకంలో, తట్టుకోలేని ఆత్మ సంఘర్షణలో నారాయణే కనక వాగి, బయటపడి ఉండకపోతే ఈ విషయం అసలు బైటకొస్తుందా? ఎన్నో ప్రకృతి బీభత్సాల్లో, ప్రమాదాల్లో బోలెడు ధన నష్టం, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగి, ఇలా ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించినప్పుడు, చాలామంది ముసలివాళ్లనూ, అయినవాళ్లనూ ఆ సొమ్ము కోసం అంతం చేసిన చెదురుమదురు సంఘటనలు గుర్తుచేసుకోండి యువరానర్!

నారాయణ చేసింది అమానుషమే అయినా, ఆ కుటుంబ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో తీర్పు చెప్పండి యువరానర్!

అసలు ఒక ప్రాణానికి విలువ కట్టి ఇంత అని ఎక్స్‌గ్రేషియా చెల్లించే ఈ రాజకీయపు ఎత్తుగడలకు, లబ్ధికి స్వస్తి చెబితే ఇలాంటి దురాగతాలు, అమానుషాలు కొంతవరకైనా తగ్గుతాయి.

నష్టం ఏ మేరకు, ఎవరికి జరిగిందో సమగ్ర దర్యాప్తు జరిపి, వారికి అవసరమైన సహాయం చెయ్యడం మానవత. అంతేకానీ, ఎక్కడ ఏ రకమైన ప్రమాదాలు జరిగినా పోయిన ప్రాణానికి వెలకట్టడం అనేది ఓ రకంగా ప్రాణాలతో జూదం, చెలగాటం ఆడటమే యువరానర్! దయచేసి నే చెప్పిన పాయింట్ల గురించి ఆలోచించి, నారాయణకు దయాభిక్ష పెట్టవలసినదిగా అర్థిస్తున్నాను.'

'వద్దు బాబూ... నాలాంటి పాపిష్టోడికి, రాచ్చసుడికి దయాధర్మం చూపొద్దు బాబూ... నా మీద జాలి చూపొద్దు బాబూ. నాయునా బుజ్జిపండూ నేనూ నా దగ్గరకే వచ్చేస్తున్నా బాబూ... నన్ను చమించరా తండ్రీ...' అంటూ పెద్దగా ఏడ్చి బోనులోనే దుబ్బున పడిపోయాడు.

తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. దానికి శిక్ష తనకి తనే వేసుకున్న నారాయణ గుండె పగిలేలా ఏడ్చి, ఏడ్చి గుండె ఆగి కోర్టు బోనులోనే చచ్చిపోయాడు.

ఓ పచ్చటి సంసారం నాశనమైపోయిన పాపం ఎవరిదీ... స్వయంకృతాపరాధమా... లేక లోపభూయిష్టమైన ఈ వ్యవస్థదా? లేక వ్యవస్థలోని లోపాలను స్వప్రయోజనాల కోసం వాడుకునే స్వార్థపరులదా? ❑